క్లుప్తంగా

టెక్నాలజీని మంచికి వినియోగించుకోవాలి

వైవీయూ: ప్రస్తుతం వేగంగా విస్తరిస్తున్న సాంకేతికతను మంచికోసం వినియోగించాలని వైవీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎస్. సునీత సూచించారు. మంగళవారం కడప నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో స్టెప్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం – కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని సూచించారు. టెక్నాలజీని సక్రమంగా వినియోగించుకుని విజయానికి బాటలు వేసుకోవాలని సూచించారు. స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ మాట్లాడుతూ పదో తరగతి పూర్తయిన వారు త్వరితగతిన జీవితంలో స్థిరపడాలనుకుంటే సానుకూల దృక్పథంతో అర్హతకు తగ్గ జాబ్ ఓరియంటెడ్ కోర్సులను ఎంపికచేసుకోవాలని సూచించారు. ఐటీఐ ఏడీ రత్నరాజు, స్టెప్ మేనేజర్ సుబ్బారాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



విద్యార్థులకు మెటీరియల్‌ను అందచేస్తున్న అహ్మద్‌బాష

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని హరూన్ గ్రూపు అధినేత అహ్మద్‌బాష అన్నారు. మంగళవారం కడపలోని నగరపాలక బాలుర ఉర్దూ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ (సీఈడీఎం) వారు ఉచితంగా మైనార్టీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏపీ ప్రభుత్వం రూపొందించిన మెటీరియల్‌ను అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అహ్మద్‌బాష మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామర్థ్యాలు పెంపొందించు కోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్

వైవీయూ : మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం పక్కీరుపల్లెలోని శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగిక వేధింపుల నిరోధక చట్టం, లోకాయుక్త, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్, డొమెస్టిక్ వయొలెన్స్ యాక్ట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ అసిస్టెంట్ పి. మనోహర్, ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్, కళాశాల కరస్పాండెంట్ డి.ఎస్.ఆర్. మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీటీఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ ప్రతినిధులు

వైవీయూ : డిగ్రీ విద్యలో బీబీఏ, బీసీఏ, బీహెచ్‌ఎం వంటి కోర్సుల ఏర్పాటుకు సంబంధించి ఏఐసీటీఈ (ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) అనుమతులు పొందాలంటూ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు జి. సుబ్బారెడ్డి, వైఎస్‌ఆర్ కడప జిల్లా కార్యదర్శి వెంకట శ్రీనివాసులు కోరారు. మంగళవారం ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల కరస్పాండెంట్లు సురేష్, నాగేశ్వర్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

చింతకొమ్మదిన్నె : వైఎస్సార్ ఆసరా నాలుగో విడతలో భాగంగా బుధవారం కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు కార్యక్రమానికి హాజరు కానున్నట్లు పీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం మండల కేంద్రంలోని శ్రీ శక్తి కార్యాలయ ఆవరణలో జరుగుతుందన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని దీవించండి

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని దీవించాలని ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. మంగళవారం ।గడప గడపకు మన ప్రభుత్వం౹లో భాగంగా మరియాపురం పరిధిలోని చౌటపల్లి రోడ్డు, సూర్యా కాంప్లెక్స్ సమీపంలోని పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. వారికి ఈ ప్రభుత్వంలో పొందిన లబ్ధి సమాచారంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కుల,మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.3వేలకు పెంచడం జరిగిందన్నారు.

– ఆనంద్ రెడ్డి అనే వ్యక్తి మాట్లాడుతూ ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, వైఎస్ఆర్ రైతు భరోసా, వైఎస్సార్ పింఛన్ కానుక పథకాల ద్వారా రూ. 4.68లక్షలు లబ్ధి పొందామని, ఈ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ బాసటగా ఉంటామని తెలిపారు.

– గౌరబత్తిన శ్రీదేవి మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుండి తమ కుటుంబానికి వైఎస్ఆర్ పింఛన్ కానుక, జగనన్న తోడు, జగనన్న విద్య దీవెన, జగనన్న వసతి దీవెన, వైఎస్ఆర్ రైతు భరోసా వంటి పథకాల ద్వారా రూ. 2.09 లక్షలు లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది.

– ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, హరూన్ గ్రూప్ ఎండీ అహమ్మద్ బాషా, 40 వ డివిజన్ కార్పొరేటర్ ఆర్. బాలస్వామి రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రా రెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, ఎన్. సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఉమైర్, త్యాగరాజు, మధు, లక్ష్మి నారాయణ, ఏ1 నాగరాజు, సంపత్, బండి మరియలు, టీపీ వెంకట సుబ్బమ్మ, నారాయణమ్మ, చైతల్య, హైమవతి పాల్గొన్నారు.

రూట డైరీ ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్(రూట) డైరీని డిప్యూటీ సీఎం అంజాద్‌బాష మంగళవారం కడపలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. రూట డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్ సాహెబ్, రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, మను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముక్సిత్‌ఖాన్, డైరీ కమిటి కో చైర్మన్ సిరాజుద్దీన్, రూట రాష్ట్ర నాయకులు సత్తార్‌ఫైజీ, ముహమ్మద్ అయ్యూబ్, అఫ్జల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత



నియామక పత్రాలు అందుకున్నవారితో డిప్యూటీ సీఎం

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపికైన అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాళ్లకు మంగళవారం ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష తన క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. చంద్రకళ (నబీకోట-1), శ్వేత (నబీకోట-2), రోజా (బుడ్డాయిపల్లె), బీబి ఆయేసా(పాత బస్టాండు), వెంకట నారాయణమ్మ (సున్నపు బట్టీలు), ప్రసన్న (శాస్త్రినగర్), సుభద్ర (లోహియానగర్), రాజేశ్వరి (కందిపాలెం), శిరీష (నబీకోట-3), సరోజ (బాలాజీనగర్) నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామకృష్ణారెడ్డి, చల్లా రాజశేఖర్, నాగ మల్లారెడ్డి, లక్ష్మయ్య, మధుసూదన్ రెడ్డి, నాయకులు తోటకృష్ణ, అహమ్మద్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు 'పర్యాటక వీక్షణం' పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : కవితా విద్య సాంస్కృతిక సేవా సంస్థ చైర్మన్ అలపర్తి పిచ్చయ్యచౌదరి రచించిన 'పర్యాటక వీక్షణం' (ట్రావెలాగ్) పుస్తకాన్ని బుధవారం స్థానిక ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలో ఆవిష్కరించనున్నారని రాయలసీమ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా, ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అధ్యక్షత వహిస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు.

ఘనంగా ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ వర్ధంతి

కడప ఎడ్యుకేషన్: కడప నగరం మట్టి పెద్దపులి వద్ద జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న ఖాన్ అబ్దుల్ గఫూర్‌ఖాన్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదరబాష మాట్లాడుతూ ఖాన్ అబ్దుల్ గఫూర్‌ఖాన్ నేటి తరానికి ఆదర్శనీయులన్నారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ పోటీలు

కమలాపురం : స్థానిక సీఎస్ఐ చర్చి మైదానంతో పాటు గురుకుల పాఠశాలలో బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. మంగళవారం ఆమె సీఎస్ఐ చర్చి మైదానాన్ని పరిశీలించారు. కమలాపురం నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని, వారికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు. సీఎస్ఐ చర్చి మైదానంలో క్రికెట్, వాలీబాల్, గురుకుల పాఠశాలలో కబడ్డీ, ఖో-ఖో, బ్యాండ్మిటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 24, 25, 27, 29 తేదీల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే ఈ పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు సభ్యులు హాజరై ఈ పోటీలను జయప్రదం చేయాలని ఆయన తెలిపారు.

216 పనులు గుర్తించాం

కమలాపురం : మండలంలోని 18 పంచాయతీల్లో 216 పనులు గుర్తించామని ఉపాధి హామీ పథకం ఏపీఓ పార్థ సారధి తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ పనులు పూర్తిగా అయిపోవడంతో ఉపాధి పనులు ఊపందుకున్నాయన్నారు. 5053 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. పనుల అభ్యర్థనకు దరఖాస్తు చేసుకున్న వారందరికి పనులు కల్పిస్తామన్నారు. రూ.9 కోట్ల మేరకు పనులు చేయాల్సి ఉందని, అయితే రూ.4.5 కోట్ల మేరకు ఇప్పటికే 216 పనులు గుర్తించామన్నారు. 2.99 లక్షల పని దినాలు కల్పించామన్నారు. అయితే 100 రోజుల సమీపంలో 76 మంది ఉన్నారని, వారికి ప్రాధాన్యత ఇచ్చి వారికి 100 రోజు పనిదినాలు పూర్తి చేస్తామన్నారు. ఏప్రిల్ నుంచి కొత్త జాబ్ కార్డులు వస్తాయన్నారు. ప్రతి వ్యక్తికి రూ.272 కూలీ పడే విధంగా కొలతలు ఇస్తామన్నారు. పనికి వచ్చే కూలీలు కనీసం 4 గంటలు పని చేయాల్సి ఉంటుందని, పని ప్రారంభించగానే ఒక ఫొటో అప్‌లోడ్ చేయాలని, తిరిగి నాలుగు గంటల తర్వాత ఫొటో అప్‌లోడ్ చేస్తేనే మస్టర్ పేమెంట్ అవుతుందన్నారు. ఆసక్తి గల వారికి డ్రైల్యాండ్ హార్టికల్చర్‌కు కూడా ప్రాధాన్యత ఇస్తామన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



కడప కార్పొరేషన్ : మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్



కడప ఎడ్యుకేషన్: కడప మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం తింటున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్

కడప కార్పొరేషన్: కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతాలోపాలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ జి. ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుంచి వై జంక్షన్, అన్నమయ్య జంక్షన్ నుంచి క్రిష్ణదేవరాయల సర్కిల్, దేవుని కడప రోడ్ నుంచి మాసాపేట జంక్షన్‌లలో జరుగుతున్న పనులను ఇంజనీరింగ్, టౌన్ ప్లాన్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి వాటర్ ఫ్లో ఆధారంగా డ్రైనేజీ కాలువ నిర్మించాలని, రోడ్డుకు, కాలువకు మధ్య ఉన్న గ్యాప్‌ను సరిదిద్దాలన్నారు. అంబేడ్కర్ సర్కిల్‌లో హైమాస్ లైట్లను అమర్చాలని, డివైడర్‌లో స్ట్రీట్‌లైట్లు ఆన్, ఆఫ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య జంక్షన్ వద్ద ఎలక్ట్రికల్ పనులు తక్షణం పూర్తి చేయాలని, ట్రాఫిక్ బ్లాక్‌లను తొలగించాలన్నారు. క్రిష్ణదేవరాయల సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ రోడ్డులో ఆక్రమణలను తక్షణం తొలగించాలన్నారు. దేవుని కడప రోడ్డులో డ్రైనేజీలపై స్లాబ్ ఏర్పాటు చేయు విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఆర్‌అండ్‌బి, నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంతో పౌష్టికాహారం

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంతో పౌష్టికాహారం అందుతోందని కడప నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్‌లు అన్నారు. మంగళవారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌ను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులు ప్రతి ఒక్కరికి ప్రేరణ పుస్తకాలు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరూ ప్రేరణ పుస్తకాలను చదవాలని సూచించారు. నంతరం వారిరువురు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని భుజించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వీరి వెంట కడప ఎంఈఓ పాలెం నారాయణ, హెచ్‌ఎం నాగమణి పాల్గొన్నారు.

నేతాజీ సేవలు మరువలేనివి



వైవీయూ: నేతాజీ జయంతి వేడుకల్లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు



కడప ఎడ్యుకేషన్: నేతాజీ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి ఉద్యమానికి ఊపిరిపోసిన యోధుడు అన్నారు. ఆయన జయంతిని పరాక్రమ్ దివస్‌గా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. అంకాల నాగరాజు, శివ రామకృష్ణ, డా. లీలావర్ధిని, శివపార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశ స్వాతంత్ర్యంలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ సేవలు మరువలేనివని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చార్లెస్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేతాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

నేతాజీ ఆశయాలతో కడప ఉక్కు కోసం యువత ఉద్యమించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం నేతాజీ జయంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

కడప ఎడ్యుకేషన్: నేతాజీ ఆలోచన విధానంతో నేటితరం యువత ముందుకు వెళ్లాలని ఆల్ ఇండియా యూత్ లీగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ అన్నారు. నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి మంగళవారం కడపలోని ఆర్కే ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆల్ ఇండియా యూత్ లీగ్, అఖిల భారత విద్యార్థి బ్లాక్ కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ గర్ల్స్ కన్వీనర్ వరలక్ష్మి, కన్వీనర్లు వినోద్, సోమశేఖర్, అంజలి, లక్ష్మి, శిరీష, మానస తదితరులు పాల్గొన్నారు.

టన్ను చీనీ ధర రూ.26వేలు



చీనీ కాయల మార్కెట్‌లో వేలం పాటను పరిశీలిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప

పులివెందుల రూరల్ : పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న చీనీ కాయల మార్కెట్ మళ్లీ ప్రారంభం కావడంతో రైతులు తమ పండించిన చీనీ కాయలను తీసుకొచ్చి చీనీ కాయల మార్కెట్‌లో వేలం పాట నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం చీనీ కాయల మార్కెట్ టన్ను రూ.26వేలు పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చీనీ కాయల మార్కెట్ సీజన్ కాకపోయినప్పటికి ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. చీనీ కాయల మార్కెట్‌కు గత రెండు రోజుల నుంచి సుమారు 50 టన్నులకుపైగా చీనీ కాయలు వచ్చాయని మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డిలు తెలిపారు. మంగళవారం వారు చీనీ కాయల మార్కెట్‌లో వేలంపాటను వారు పరిశీలించి మాట్లాడారు. రాబోయే విషయాలన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు తమ పండించిన పంటలకు చీనీ కాయల ధరలు కారణమని.. పులివెందులలో చీనీ కాయల మార్కెట్‌కు తీసుకొచ్చి వేలంపాట నిర్వహించుకోవచ్చునన్నారు. అనంతరం మార్కెట్ కంటే అధికంగా పులివెందుల చీనీ కాయల మార్కెట్‌లో ధరలు ఉన్నాయన్నారు. రైతుల కోసం అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు సెక్రటరీ రత్నరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

25న వైవీయూలో సెమినార్

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్య సెనెట్ హాల్లో ఈనెల 25వ తేది సెమినార్ జరగనుంది. 'ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి వెనుకబడిన సమూహాల కోసం డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంక్షేమ చర్యలు' అనే అంశంపై ఒక రోజు సెమినార్ నిర్వహించనున్నట్లు ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ లోకా సుబ్రమణ్యం శర్మ, సీడీసీ డీన్ ఆచార్య రఘుబాబు తెలిపారు. ముఖ్యఅతిథిగా వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, విశిష్ట అతిథులుగా రిజిస్ట్రార్ ఆచార్య వైపి వెంకట సుబ్బయ్య, ప్రధాన ఆచార్యులు ఎస్ రఘునాథరెడ్డి హాజరవుతున్నారని తెలిపారు.

రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ అసోసియేషన్ కడపశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరానికి చెందిన చెమ్ముమియాపేట జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు గిరిజా కుమారి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శంకర్ రెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఆ కవులు 'సీమ' సాహితీ రత్నాలు

కడప కల్చరల్ : జీవితాన్ని ఒంటిమిట్ట శ్రీరామ చంద్రుడికి అంకితం చేసి తన సాహిత్యాన్ని కేవలం ఆ రాముడిపైనే కేంద్రీకరించి అపర వాల్మీకిగా పేరుగాంచిన వావిలికొలను సుబ్బారావు, తన సాహితీ పాండిత్యం, విమర్శలతో ప్రత్యేక ముద్ర వేసిన రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ రాయలసీమ సాహితీ రంగానికి లభించిన రత్నాల్లాంటి వారని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సీకే సంపత్ కుమార్ పఠన మందిరంలో మంగళవారం ప్రసిద్ధ సాహితీవేత్తలు వావిలికొలను సుబ్బారావు 161వ జయంతిని, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 131వ జయంతిని నిర్వహించారు. తొలుత బ్రౌన్ కేంద్రం సిబ్బందితో కలిసి ఆయన వారి చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథపాలకులు జి.హరిభూషణరావు, రచయిత కొత్తపల్లె రామాంజనేయులు మాట్లాడారు.

ఆర్థిక చేయూత



చిన్నయ్య కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న కడప అగ్నిమాపక జిల్లా అధికారి ధర్మారావు

కడప అర్బన్: జమ్మలమడుగు ఫైర్ స్టేషన్‌లో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న చిన్నయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబసభ్యులకు రూ. 68,600 విరాళంగా సేకరించి అందచేశారు. ఈ మొత్తాన్ని కడపలోని జిల్లా అగ్నిమాపక కేంద్ర కార్యాలయంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ధర్మారావు చేతుల మీదుగా చిన్నయ్య కుటుంబసభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కడప అగ్నిమాపక కేంద్రం అధికారి బసివిరెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వరం

కమలాపురం : పేద ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరం లాంటిదని సర్పంచ్ రవిశంకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లెలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పేద ప్రజలకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని వైద్యులను ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించడం పేద ప్రజలకు వరంగా మారిందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, ఈఓఆర్‌డీ శారదారెడ్డి, వివిధ విభాగాల వైద్యులు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



సిద్దవటం : మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రాముడి ఆలయంలో సోమవారం రాత్రి స్వామివారి విగ్రహాన్ని వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అయోధ్య రామాలయంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని మాచుపల్లిలో శ్రీ సీతారామ, లక్ష్మణ ఆంజనేయ స్వాముల ఉత్సవమూర్తులతోపాటు శ్రీరాముడి విగ్రహానికి గ్రామోత్సవం చేశారు. భక్తులు కాయాకర్పూలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

800 ఎస్‌హెచ్‌జీలకు వైఎస్సార్ ఆసరా నిధులు

కమలాపురం : మండలంలోని 800 ఎస్‌హెచ్‌జీలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ. 6.53 కోట్లు నిధులు విడుదలైనట్లు వెలుగు ఏపీఎం అపర్ణదేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 800 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 6,53,29,000 విడుదలైందన్నారు. ఇది వరుసగా నాలుగవ సారి ఆసరా పథకం ద్వారా నిధులు విడుదలయ్యాయన్నారు. ఈ నెల 30వ తేదీన సమావేశం నిర్వహించి సభ్యుల ఖాతాల్లో నిధులు జమచేస్తామని ఆమె తెలిపారు.